## గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

లింగాల, అక్టోబర్ 12: మండలం కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల చెందిన ప్రిన్సిపాల్ వినోద్‌ఖన్నాను సస్పెండ్ చేస్తూ గురువారం సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌నికోలాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 10తేదీ రాత్రి 9వ తరగతి విద్యార్థులను ఇంటర్మీడియట్ విద్యార్థులు చితకబాదిన ఘటనలో విద్యార్థుల తల్లిదండ్రులు, కులసంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించిన ఘటన పాఠకులకు విదితమే. దీనిపై ముఖ్యకార్యదర్శి విచారణ అనంతరం ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశారు. వైస్ ప్రిన్సిపాల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

## బెల్ట్‌షాపులపై దాడులు

## :నలుగురిపై కేసు నమోదు



పుల్లూరులో పట్టుబడిన మద్యంతో పోలీసులు

ఉండవెల్లి, అక్టోబర్ 12: మండలంలోని పుల్లూరులో అక్రమంగా బెల్ట్ షాపులపై ఎక్సైజ్ పోలీసులు గురువారం ఆకస్మికంగా దాడులు చేసి, కేసులు నమోదు చేశారు. ఎస్సై హరికృష్ణ తెలిపిన వివరాలు.. పుల్లూరుకు చెందిన లోకేష్, దీపక్, జయలక్ష్మి, శంకర్ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్సై మొగలప్ప దాడులు చేసి, మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన మద్యం విలువ రూ.90వేలు ఉంటుందని, నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై హరికృష్ణ తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రామాంజనేయులు, గోవింద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కేఎల్ఐ కాల్వలో వృద్ధురాలి మృతదేహం

మిడ్జిల్, అక్టోబర్ 12: కాల్వలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని చిల్వేర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన దేవాభాయ్(62) ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతికినా కనిపించలేదు. గురువారం సాయంత్రం గ్రామ శివారులోని కేఎల్ఐ కాల్వలో మహిళ మృతదేహం లభ్యమైంది. గ్రామస్తుల సహకారంతో మృతదేహాన్ని బయటికి తీశారు. మృతికి గల కారణాలు తెలియలేదు.

## రూ.రెండు లక్షలు పట్టివేత

## :ఐదుగురిపై కేసు

పెబ్బేరు, అక్టోబర్ 12: మండలకేంద్రంలో వాహనాల తనిఖీల్లో గురువారం రూ.2లక్షలు పట్టుకున్నట్లు ఎస్సై జగదీశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నాగర్‌దొడ్డికి చెందిన బండారు తిమ్మప్ప, మత్తయ్య, నాగరాజు మరో ఇద్దరి వద్ద రూ.2లక్షలు నగదు ఉన్నాయని తెలిపారు. వాటికి ఎలాంటి రసీదులు లేకపోవడంతో డబ్బులను సీజ్ చేసి, కేసు చేశామని ఎస్సై తెలిపారు.

## మద్యం పట్టివేత: వ్యక్తిపై కేసు నమోదు

పెబ్బేరు, అక్టోబర్ 12: పెబ్బేర్ మండలం చెలిమిల్లలో బెల్ట్‌షాప్‌పై దాడి చేసి రూ.55వేల విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడు మహేశ్‌పై కేసు నమోదు చేశామని పెబ్బేర్ ఎస్సై జగదీశ్వర్ తెలిపారు. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం అందడంతో దాడి చేశామని తెలిపారు.

## బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

గోపాల్‌పేట, అక్టోబర్ 12: బైక్‌పై నుంచి పడి మహిళ మృతి చెందింది. ఈ ఘటన రేవల్లి మండలం కొంకలపల్లి సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై శివకుమార్ కథనం మేరకు... రేవల్లి మండలం గొల్లపల్లికి చెందిన బంకల కురువమ్మ (48), భర్త ఎల్లయ్యతో కలిసి బుధవారం ఉదయం నాగనూల్‌లో బంధువు చావుకు వెళ్లారు. అంత్యక్రియలు ముగించుకొని, సాయంత్రం వారి బంధువైన వెంకటయ్య బైక్‌పై గ్రామానికి బయలుదేరారు. కొంకలపల్లి సమీపంలోకి రాగానే వెనకాల కూర్చున్న కురువమ్మ ప్రమాదవశాత్తు కింద పడింది. దీంతో తలకు బలంగా గాయాలయ్యాయి. చికిత్స కోసం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. గురువారం మృతురాలి కొడుకు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

# ఎమ్మెల్యే ఆలకే మా ఓటు..

- బతికున్నంత వరకు సీఎం కేసీఆర్‌కే మద్దతు
- ఏకగ్రీవ తీర్మానం చేసిన పాత జంగమాయపల్లి వాసులు

కొత్తకోట, అక్టోబర్ 12 : 'ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికే మా ఓటు' అంటూ కొత్తకోట మండలంలోని పాతజంగమాయపల్లి గ్రామస్తులు గురువారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కనిమెట్ట–పాతజంగమాయపల్లి గ్రామాల మధ్య ఊకచెట్టు వాగుపై బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని ఉమ్మడి రాష్ట్రంలో సీఎంలు చంద్రబాబునాయుడు, వైఎస్సార్‌కు ఎన్నో సార్లు విన్నవించుకున్నామన్నారు. ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు మారినా తమ సమస్య మాత్రం తీరలేదన్నారు. ఉద్యమనేత అయిన కేసీఆర్ ముఖ్యమంత్రి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఏర్పాటయ్యాక తమ కష్టాలను చూసి చలించి బ్రిడ్జి నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారన్నారు. ఇందుకుగానూ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.12.35 కోట్లు కేటాయించగా.. 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే 14 గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయన్నారు. అంతేకాకుండా పాత జంగామాయపల్లి గ్రామానికి బ్రిడ్జితోపాటు నూతన గ్రామ పంచాయతీని ఏర్పాటు చేసేందుకు జీవో వెలువడిందన్నారు. గ్రామానికి ఇంతగా మంచి చేస్తున్న సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నామన్నారు. తమ తలరాత మారుస్తున్న వారిని ప్రత్యక్ష దైవంగా భావిస్తున్నామన్నారు. బతికున్నంత వరకు సీఎం కేసీఆర్ వైపే నడుస్తామన్నారు.



తమ మద్దతును ప్రకటిస్తున్న పాతజంగమాయపల్లి గ్రామస్తులు

# సీఎం సభకు ముమ్మర ఏర్పాట్లు

- 18న జడ్చర్లకు ముఖ్యమంత్రి కేసీఆర్ రాక
- సభాస్థలాన్ని చదును చేయిస్తున్న నాయకులు



బహిరంగ సభా స్థలాన్ని డోజర్లతో చదును చేస్తున్న దృశ్యం

జడ్చర్ల, అక్టోబర్ 12 : ఈనెల 18వ తేదీన జడ్చర్లలో సీఎం కేసీఆర్ నిర్వహించను న్న బహిరంగ సభకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జడ్చర్ల శివారులోని గంగాపూర్‌లో ఉన్న శివాలయం సమీపంలో బహిరంగసభను నిర్వహించనున్నారు. సభ ప్రాంగణంతోపాటు హెలీప్యాడ్ స్థలాన్ని డోజర్లు, జేసీబీలతో చదును చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులను జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కాగా, సభకు భారీగా జనసమీకరణ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నా రు. నియోజకవర్గంలోని జడ్చర్ల, మిడ్జిల్, ఊర్కొండ, నవాబ్‌పేట, బాలానగర్, రాజాపూర్ మండలాల నుంచి జనాలు వచ్చేలా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు.

# ఆరు గ్యారెంటీలతో మోసం

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు.. ఇచ్చేది లేదు
- అభివృద్ధిని విస్మరించిన వారికి ఓటడిగే హక్కు ఎక్కడిది..?
- 18న సీఎం కేసీఆర్ సభకు భారీగా తరలిరావాలి
- కార్యకర్తల సమావేశంలో జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిడ్జిల్, అక్టోబర్ 12 : కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ రు గ్యారెంటీల మాటున మోసం చేసేందుకు వస్తున్నార ని, వారితో అప్రమత్తంగా ఉండాలని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉండి కూడా ఏమీ చేయలేని కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల్లో ఓటడిగే హక్కు లేదని దుయ్యబట్టారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు తాగునీరు, రోడ్లు, మురికి కాలువలు, కరెంట్ వంటి మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించలేకపోయిందని ప్రశ్నించారు. అప్పుడే ఏమీ చేయలేని వారు ఇప్పుడు వచ్చి మరోసారి అవకాశం ఇ వ్వాలని కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అభివృద్ధిని విస్మరించిన వారికికి ఓటేద్దామా..? నిరంతరం అభివృద్ధికి పాటుపడుతున్న వారికి ఓటేద్దామా..? అనే విషయాలను ప్రజలు ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ వారంటీ లేని గ్యారెంటీలు ఇస్తున్నదంటూ ఎద్దేవా చేశారు. క ర్ణాటకలో ఇచ్చిన హామీలు అమలు చేయలేక ఆగమాగం అవుతున్నదని, తెలంగాణకు వచ్చి మళ్లీ అలాంటి పగటివేషాలే వేస్తూ ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తున్నదన్నారు. అలాంటి కుప్పిగంతులను ప్రజలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 3 గంటల కరెంట్ కావాలా.. 3 పంటల కేసీఆర్ కావాలా.. తేల్చుకోవాలన్నా రు. సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతున్నదన్నారు. పని చేసే ప్రభుత్వాల వెంట ఉండాలని కోరారు. కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, దళితబంధు, బీసీబంధు, మైనార్టీబంధు, గృహలక్ష్మి వంటి ఎన్నో రకాల పథకాలు ప్రజల దరికి చేరుతున్నాయన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ఉండి గెలుపునకు కృషి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించనున్న మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకు మైండ్ బ్లాంక్ అవుతుందన్నారు. ఈ నెల 18న జడ్చర్లలో నిర్వహించనున్న బహిరంగ సభకు సీఎం కేసీఆర్ వస్తున్నారని, ప్రతి గ్రామం నుంచి బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.



మిడ్జిల్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

### లక్ష మెజార్టీతో గెలిపిస్తాం..

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని ముచ్చటగా మూడోసారి లక్ష మెజార్టీతో గెలిపిస్తామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాండు తెలిపారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్ష అని అన్నా రు. పార్టీ కార్యకర్తలు పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. సీఎం కేసీఆర్‌కు తిరుగులేదని.. ఎమ్మె ల్యే లక్ష్మారెడ్డికి ఎదురులేదన్నారు. సమావేశంలో ఎంపీ పీ సుదర్శన్, పీఏసీసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబం ధు సమితి మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచు ల సంఘం మండలాధ్యక్షుడు జంగిరెడ్డి, నాయకులు సు ధాబాల్‌రెడ్డి, శ్రీనివాసులుగుప్తా, శ్యాంసుందర్‌రెడ్డి, బా లు, భీమయ్యగౌడ్, ప్రతాప్‌రెడ్డి, నిరంజన్, నారాయణరెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవి, ఎల్లయ్య యాదవ్, భాస్కర్, జగన్‌గౌడ్, భీంరాజు, నవీనాచారి, లక్ష్మణ్‌పవర్ తదితరులు పాల్గొన్నారు.